క్లుప్తంగా

ఎమ్మెల్యే ముత్తంశెట్టికి బీ ఫారం అందజేత



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు బీ ఫారం అందజేస్తున్న వైవీ సుబ్బారెడ్డి

మధురవాడ: భీమిలి నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి బీ ఫారం అందజేశారు. ఈ నెల 24న ముత్తంశెట్టి నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్ వద్ద నివాసంలో సోమవారం బీ ఫారం అందజేశారు.

ఎమ్మెల్యే ముత్తంశెట్టి గెలుపు కోసం కృషి చేస్తా



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆలీవర్‌రాయ్

భీమునిపట్నం: కేథరిన్ విద్యా సంస్థల అధినేత, జనసేన నుంచి రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ఆలీవర్‌రాయ్ సోమవారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముత్తంశెట్టి శ్రీనివాసరావు గెలుపు కోసం తన వంతు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు.

తిరుమల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో తిరుమల యాజమాన్యం

తగరపువలస: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో భీమిలి మండలం తాళ్లవలస తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ సంస్థ చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. 600 మార్కులకు వి.సందీప్ 597, జి.దేదీప్య 595, బి.జయవర్ధన్ నాయుడు, ఎస్.శ్యామ్, ఎం.గిరిధర్, ఎం.భగవతి 594, జి.తరుణ ఆదిత్య, ఎం.ఫణీంద్ర 593 మార్కులు సాధించారన్నారు. ఇంకా 20 మంది విద్యార్థులకు 590కు పైగా మార్కులు లభించాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాలయులను రెసిడెంట్ డైరెక్టర్లు ఇ.మృత్యుంజయరావు, కె.ఎస్.వి.వి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, జి.సతీష్‌బాబు అభినందించారు.

మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ కార్యవర్గం



ఎన్నికైన అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

మధురవాడ: మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ 2024 – 25 సంవత్సరానికి నూతన కార్యవర్గం ఎన్నికైంది. మధురవాడలో సోమవారం నిర్వహించిన సమావేశంలో చైర్మన్‌గా నక్కాన శ్రీధర్, ప్రెసిడెంట్‌గా పోతిన శివ, సెక్రటరీగా కె.రామకృష్ణారావు, కోశాధికారిగా పిళ్లా మోహన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలు అధికారులుగా కోనేటి రామకృష్ణ, ఎస్.రామారావు వ్యవహరించారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

పద్మనాభం: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్ర స్థాయిలో వైద్యులు ప్రజలకు తెలియజేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పి.జగదీశ్వరరావు సూచించారు. రేవిడి, ఆనందపురం పీహెచ్‌సీలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడపడితే అక్కడ నీళ్లు తాగకూడదని, మంచి నీరు, ఓఆర్ఎస్ కలిపిన నీరు తాగేటట్టు అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు నూరు శాతం వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించారు.

పరిశోధనలతో ఆవిష్కరణలు

కొమ్మాది: పరస్పర సహకారంతో పరిశోధనలు చేయడం ద్వారా నూతన ఆవిష్కరణలు సాధించవచ్చని గాయత్రి కళాశాల జాయింట్ సెక్రటరీ ప్రొఫెసర్ పి.రాజు గణపతి అన్నారు. రుషికొండలో గల గాయత్రి విద్య పరిషత్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం 5 రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రజిని, ఇన్‌చార్జి డైరెక్టర్ పి.వినయ్, తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేద్దాం

● ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



పెద్దిపాలెంలోని చెన్నాస్ ఫంక్షన్ హాలు



వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ/తగరపువలస : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర భీమిలి నియోజకవర్గంలో విజయవంతం చేసేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. కారుషెడ్ జంక్షన్ వద్ద పార్టీ ఎన్నికల కార్యాలయంలో నాయకులతో సోమవారం ఆయన మాట్లాడారు. మంగళవారం ఉదయం 9 గంటలకు పీఎం పాలెం వద్ద గల క్రికెట్ స్టేడియం నుంచి యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. మధురవాడలో రోడ్ షో నిర్వహిస్తారని, స్టేడియం నుంచి కారుషెడ్, చంద్రంపాలెం, మధురవాడ, కొమ్మాది, మారికవలస, బోయిపాలెం, గంభీరం, ఆనందపురం మీదుగా పెద్దిపాలెం వద్దనున్న చెన్నా కన్వెన్షన్ సెంటర్‌కు ఉదయం 11 గంటలకు చేరుతుందన్నారు. అక్కడ మధ్యాహ్నం 1 గంట వరకు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సభ్యులతో సీఎం జగన్ సమావేశమవుతారన్నారు. మధ్యాహ్నం భోజన విరామం తర్వాత తగరపువలస మీదుగా విజయనగరం జిల్లాలోకి బస్సు యాత్ర ప్రవేశిస్తుందని చెప్పారు. అంత వరకు అందరూ అనుసరించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతురావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, గడ్ల పోలిరెడ్డి, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

24న భీమిలిలో నామినేషన్ వేస్తా

భీమిలి ఆర్డీవో కార్యాలయంలో ఈ నెల 24న మధ్యాహ్నం 11 నుంచి 1 గంట మధ్య నామినేషన్ దాఖలు చేస్తున్నట్టు శ్రీనివాసరావు చెప్పారు. దీనికి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, అభిమానులు విశేషంగా తరలి రావాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయ్యాక విశాఖ పరిపాలన రాజధాని అవుతుందని, ఇక్కడే ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. పరిపాలనా రాజధాని కావడం వల్ల ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఎల్లో మీడియా ఏదో ఒక రకంగా తమ మీద బురద చల్లే ప్రయత్నం చేస్తోందని, ఒకరిద్దరు పార్టీ నుంచి వెళ్లినంత మాత్రాన వచ్చిన నష్టం ఏమీ లేదన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి భీమిలిలో తనను ఎమ్మెల్యేగా, సీఎం జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా వున్నారన్నారు.

పెద్దిపాలెం పునీతం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రత్యక్షంగా చూడాలన్న కోరిక ఐదేళ్లుగా మా కుటుంబానికి తీరలేదు. ముఖ్యంగా మా నాన్న ఆయనకు వీరాభిమాని. ఆ కోరిక తీరకుండానే ఇటీవల ఆయన చనిపోయారు. నిత్యం సీఎం జగన్ ధ్యానంలోనే గడిపేవారు. అలాంటింది ఆయనే మేము నిర్మించిన ఫంక్షన్ హాలులో గంటన్నరపాటు ఉంటారంటే నమ్మలేకున్నాం. జనవరి 27న సంగివలసలో సిద్ధం మొదటి సభ జరిగినా ఆ జనంలోకి వెళ్లలేకపోయాం. సీఎం జగన్ రాక మా పెద్దిపాలెం ప్రజలు చేసుకున్న పుణ్యంగా భావిస్తున్నా.

– చెన్నా వెంకటేష్, చెన్నా ఫంక్షన్‌హాలు యజమాని, పెద్దిపాలెం

పది రోజులపాటు ఓటరు స్లిప్‌ల పంపిణీ

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గ పరిధిలో ఇంటింటికీ ఓటరు స్లిప్‌లను పది రోజులపాటు పంపిణీ చేయనున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారి, ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,61,884 మంది ఉన్నారని, వీరందరికీ స్లిప్‌లు అందిస్తామని తెలిపారు. రెండు రోజుల్లో బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వో) పంపిణీని ప్రారంభిస్తారన్నారు. అన్ని ఇళ్లకు ఖచ్చితంగా వీటిని అందజేస్తామని, దీనివల్ల పోలింగ్ శాతం పెరుగుతుందన్నారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న వారికి ఓటరు స్లిప్‌ల పంపిణీ ఇబ్బందికరంగా మారిందని, అక్కడకు బీఎల్‌వోలు వచ్చినప్పుడు వాచ్‌మెన్‌లు సహకరించాలని కోరారు. ఈ ప్రక్రియ పక్కాగా నిర్వహించనున్నామని, అందరూ సహకరించాలని కోరారు.

ఆరు నామినేషన్లు దాఖలు

భీమునిపట్నం: భీమిలిలో సోమవారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అడ్డాల వెంకట వర్మరాజు రెండు సెట్ల నామినేషన్లు ఎన్నికల నిర్వహణ అధికారి ఎస్.భాస్కరరెడ్డి వద్ద దాఖలు చేయగా, ఆయన భార్య అడ్డాల స్వప్న అదే పార్టీ తరపున నామినేషన్ వేశారు. దీంతో ఆ పార్టీ తరపున మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఆయనతో విశాఖ ఎంపీ అభ్యర్థి సత్యారెడ్డి, ఏపీసీసీ జనరల్ సెక్రటరీ గాదం మహేష్, సీపీఎం కన్వీనర్ ఆర్.ఎస్.ఎస్.మూర్తి పాల్గొన్నారు. భాగం గోపాలరావు బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) అభ్యర్థిగా, ఇండిపెండెంట్‌గా రెండు నామినేషన్లు వేశారు. అలాగే ఇండిపెండెంట్ అభ్యర్థిగా నందికొల్ల సంధ్య నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి.

జోరుగా వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం



రెడ్డిపల్లిలో గొడుగులతో ప్రచారం చేస్తున్న సిరుగుడి ఆదినారాయణ, ఈర్ల ఈశ్వరరావు

పద్మనాభం: ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు సోమవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. రెడ్డిపల్లిలో ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ, ఈర్ల ఈశ్వరరావు, ఐనాడ పంచాయతీ సత్యనారాయణపురంలో వైఎస్సార్ సీపీ నాయకులు మామిడి శివ రామకృష్ణ, కోరాడ రామేశ్వరరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కోరాడ పాపారావు ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని వివరించారు. రెడ్డిపల్లిలో వైఎస్సార్ సీపీ జెండా రంగులు, ఫ్యాన్ గుర్తుతో కూడిన గొడుగులు పట్టుకుని చేపట్టిన ప్రచారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పేదింటి విద్యా కుసుమాలు



శిరీష (548 మార్కులు, ఎండాడ హైస్కూల్)



మరగడ ఇందు, 569, ఆర్‌వీపురం హైస్కూల్



గౌతం రాజు, 561, నెహ్రూ హైస్కూల్



పి.సహిత, 545, సునీల్ శర్మ కాలనీ హైస్కూల్



వై.అమృత వర్షిణి, 572, గురుకుల సీవోఈ



కె.వర్షిణిప్రియాంక, 564, గురుకుల సీవోఈ

సత్తా చాటిన జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థులు

తగరపువలస: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో భీమిలి మండలానికి చెందిన జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థులు సత్తా చాటారు. ప్రభుత్వ, కార్పొరేట్ స్కూళ్లతో పోటీపడి మార్కులు సాధించారు. మండలంలో మొత్తం 1205 మంది పరీక్షలకు హాజరు కాగా 989 మంది (82 శాతం) ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది 77 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది ఇంగ్లిష్ మీడియంలో 642 మంది పరీక్షలకు హాజరుకాగా 581 మంది (90.5) ఉత్తీర్ణులయ్యారు. వీరిలో లక్ష్మీపురం హైస్కూల్‌కు చెందిన మద్దిల రాహుల్ 584 మార్కులతో 3వ స్థానంలో, చిట్టివలస హైస్కూల్‌కు చెందిన గిడుతూరి భవానీ ప్రసాద్ 583 మార్కులతో 4వ స్థానంలో నిలిచారు. అలాగే తెలుగు మీడియంలో 563 మంది పరీక్షలకు హాజరుకాగా 408 మంది (72.5 శాతం) ఉత్తీర్ణులయ్యారు. వీరిలో మజ్జివలస జెడ్పీ హైస్కూల్‌కు చెందిన రౌతు ప్రమీల 570, కాగితాల స్వాతి 563, అక్కరబోయిన రాజేష్ 562 మార్కులతో వరుసగా మండలంలో మూడో స్థానంలో నిలిచారు.

వీరిలో ఎక్కువ మంది విద్యార్థుల తల్లిదండ్రులు లారీ లేబర్, ఇతర కూలీలే కావడం గమనార్హం. ఈ విద్యార్థులను ఆయా జెడ్పీ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు గాడు పైడిరాజు, పాట్నూరు మురళీమోహన్‌రావు, పద్మజ అభినందించారు. ఇంకా మండలంలో స్కూళ్ల వారీగా మజ్జివలసలో 91 శాతం, సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్‌లో 92, చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌లో 90, రాయప్పాలెం జీవీఎంసీ హైస్కూల్‌లో 83, మజ్జిపేటలో 78, తాటితూరులో 74, చిప్పాడలో 39, అమనాంలో 83, చిట్టివలసలో 90, దాకమర్రిలో 50, తాళ్లవలసలో 80, లక్ష్మీపురం హైస్కూల్‌లో 77 శాతం ఉత్తీర్ణులయ్యారు.

● ఆనందపురం మండలంలో 95 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వెల్లంకి జెడ్పీ హైస్కూల్ 86, రామవరం 92, శిర్లపాలెం 95, గొట్టిపల్లి 89, ఆనందపురం 95, గిడిజాల 98, బోని 100, గండిగుండం 100, బోయపాలెం 92, తర్లువాడ 96, కొంత్యాం 95, కేజీబీవీలో 97 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 570 మార్కులతో గిడిజాల, 568 మార్కులతో గొట్టిపల్లి, 561 మార్కులతో ఆనందపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు మండలంలో మొదటి మూడు స్థానాలు సాధించారు.

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న సీల శిరీష 548, రమ్య 505 మార్కులు సాధించారు. ఈ పాఠశాలలో ప్రథమ శ్రేణిలో 30 మంది, ద్వితీయ శ్రేణిలో 13, తృతీయ శ్రేణిలో 13 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాలలో గత ఏడాది 43 శాతం మంది ఉత్తీర్ణులుకాగా ఈ ఏడాది 66 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని ప్రధానోపాధ్యాయురాలు కె.పరిపూర్ణ తెలిపారు.

అంధుల పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత

బీచ్‌రోడ్డు సాగర్‌నగర్‌లో గల అంధ బాలికల పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ తిరుమల ప్రసాద్ తెలిపారు. 340/500 మార్కులతో ఎస్.పుష్ప ప్రథమ స్థానంలో నిలిచింది. మొత్తం 8 మంది పరీక్షలు రాయగా ఇద్దరు ప్రథమ శ్రేణిలో, ఐదుగురు ద్వితీయ శ్రేణిలో, ఒక్కరు తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు.

● జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు 65 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో చదువుతున్న ఎరుపల్లి సాయిలక్ష్మి 497 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది.

పద్మనాభంలో 97.56 శాతం ఉత్తీర్ణత

పద్మనాభం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో 97.56 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో పి.రమణ తెలిపారు. గత ఏడాది 93.44 శాతం ఉత్తీర్ణులయ్యారన్నారు. ఆర్‌వీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మరగడ ఇందు 569 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్టు ఆయన తెలిపారు. పద్మనాభం ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.నాగచైతన్య 563 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. జి.ఆర్.తాళ్లవలస, రెడ్డిపల్లి, రేవిడి, పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కృష్ణాపురం కస్తూర్బా విద్యాలయంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 94.73, గంధవరం 94.87, మద్ది 86 శాతం, పద్మనాభం 92.26 శాతం, విజయానందపురం 93.54 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఆయన తెలిపారు. కస్తూర్బా విద్యాలయానికి చెందిన 17 మందికి 500 పైబడి మార్కులు వచ్చాయని తెలిపారు.

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి విద్యార్థులు చక్కని ప్రతిభ చాటారు. ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాలలో 78 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 77 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బి.నైమిష అత్యధికంగా 588 మార్కులు సాధించగా మరో ముగ్గురు అయిదు వందలకుపైగా మార్కులు సాధించారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 35 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. వీరిలో సీరం రాఘవి అత్యధికంగా 538 మార్కులు సాధించగా మరో ఏడుగురు 500కు పైగా మార్కులు సాధించారు. పండిట్ నెహ్రూ ఉన్నత పాఠశాలలో 72 మందికి 55 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో గౌతం రాజు 561 మార్కులు సాధించాడు. ఇంకా ముగ్గురు 500లకు పైగా మార్కులు సాధించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 63 మందికి 46 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో పి.యశ్వంత్ 554 మార్కులు సాధించాడు. ఈ పాఠశాలలో గతేడాది 65 మంది ఉత్తీర్ణులవగా... ఈ ఏడాది 73 శాతం ఉత్తీర్ణత సాధించారు.

చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో 76 శాతం..

మధురవాడ: రాష్ట్రంలోనే పెద్దదైన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 909 మంది పరీక్షలకు హాజరుకాగా 692 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 457 మంది ప్రథమ, 132 మంది ద్వితీయ, 225 మంది తృతీయ స్థానాల్లో ఉత్తీర్ణత సాధించారు.

గత ఏడాది 50 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 76 శాతం ఉత్తీర్ణత సాధించడంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మధురవాడ వాంబేకాలనీకి చెందిన షెలూన్ షాపు నడిపే వ్యక్తి కుమార్తె ఐ.నవ్య 584 మార్కులు సాధించింది. 550 పైన 12 మంది మార్కులు సాధించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సోమయాజులు, ఇతర ఉపాధ్యాయులు టాపర్ నవ్యతోపాటు ఆమె తల్లిదండ్రులను అభినందించారు.



చంద్రంపాలెం హైస్కూల్‌లో 584 మార్కులు సాధించిన విద్యార్థిని నవ్యను అభినందిస్తున్న ఇన్‌చార్జి హెచ్ఎం సోమయాజులు, తదితరులు

● మధురవాడ వాంబేకాలనీలో గల సునీల్‌శర్మ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది 53 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 89 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక్కడ 45 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 41 మంది ఉత్తీర్ణులయ్యారు. నలుగురు విద్యార్థులు 500 పైన మార్కులు సాధించారు. పి.సహిత 545 మార్కులతో స్కూలు టాపర్‌గా నిలవగా జి.పాల్ ప్రేమ్ కుమార్ 528, పి.హరీష్ 525 మార్కులు సాధించారు.

గురుకుల సీవోఈలో 97 శాతం

కొమ్మాది రిక్షా కాలనీలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల సీవోఈలో గత ఏడాది విద్యార్థులు 82.7 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 97.2 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ టి.నాగమణి చెప్పారు. విజేతలను విద్యా సంస్థలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో గురుకుల విద్యాలయాల విశాఖ, అనకాపల్లి జిల్లాల సమన్వయకర్త ఎస్.రూపావతి అభినందించారు. వై.అమృత వర్షిణి 572 మార్కులతో టాపర్‌గా నిలిచింది. కె.వర్షిణిప్రియాంక 564 మార్కులు సాధించింది.

● రేవళ్లపాలెంలోని శ్రీనివాస్ స్కూల్‌లో చదువుకున్న బొమ్మ రాహుల్ మనోజ్ 587 మార్కులు సాధించాడు. మనోజ్ తల్లి ఓ దుస్తుల దుకాణంలో సేల్స్ గర్ల్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థిని ప్రిన్సిపాల్ రాయిన శ్రీనివాస్ అభినందించి, ఉన్నత చదువులకు సహకారం అందిస్తామన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

తగరపువలస: ఆనందపురం కేజీబీవీ విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ ఎం.చంద్రకళ తెలిపారు. 39 మది విద్యార్థినులకు 38 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. అత్యధికంగా 546 మార్కులతో పి.సత్యయామిని, 544 మార్కులతో ఆర్.అశ్విని, ఎం.హారికాదేవి నిలిచారన్నారు. 11 మంది విద్యార్థినులు 500కు పైగా మార్కులు, 9 మంది 450కు పైగా మార్కులు సాధించారన్నారు.

ఐఐటీ విద్య అభ్యసిస్తాను



ఐఐటీలో చేరి ఉన్నత విద్యాభ్యాసం చేయాలన్నదే నా లక్ష్యం. నాన్న శ్రీనివాసరావు సోడాల వ్యాపారం చేస్తారు. అమ్మ మహేశ్వరి గృహిణి, చెల్లెలు వాణి ఏడో తరగతి చదువుతుంది. నాకు 583 మార్కులు వచ్చాయి.

– గిడుతూరి భవానీ ప్రసాద్, చిట్టివలస హైస్కూల్

చిత్తశుద్ధితో దేశసేవ చేస్తా



దేశసేవకు అవసరమైన ఉన్నత ఉద్యోగం కోసం ప్రయత్నిస్తాను. అందుకోసం శ్రమిస్తాను. నాన్న తిరుపతి స్వామి బేకరీలో పనిచేస్తారు. అమ్మ లక్ష్మి గృహిణి. చెల్లెలు మాధురిసాయి 7వ తరగతి చదువుతుంది. నాకు 575 మార్కులు వచ్చాయి.

– ప్రేమ్‌కుమార్ సాహు, చిట్టివలస హైస్కూల్

ఇంజినీరింగ్ చదువుతా



నాకు ఇద్దరు అక్కలు. ఒకరు డిగ్రీ, మరొకరు పదో తరగతి పూర్తి చేశారు. నాన్న బాలాజీ వ్యవసాయం చేస్తారు. అమ్మ సంతోషి గృహిణి. నేను ఇంజినీరింగ్ పూర్తి చేసి దేశాభివృద్ధికి దోహదపడతాను. మండలంలో తెలుగు మీడియంలో అత్యధికంగా 570 మార్కులు లభించాయి.

– రౌతు ప్రమీల, మజ్జివలస హైస్కూల్

ఉన్నతవిద్య అభ్యసిస్తాను



ఉన్నత విద్య ద్వారా గ్రామానికి, స్కూల్‌కు, తల్లిదండ్రులకు పేరు తీసుకొస్తాను. నాన్న అప్పలనారాయణ లారీ డ్రైవర్, అమ్మ అంకమ్మ గృహిణి. నాకు అక్క స్వాతి, చెల్లెలు రోహిణి ఉన్నారు. నాకు 563 మార్కులు వచ్చాయి. – కాగితాల స్వాతి, మజ్జివలస హైస్కూల్

ట్రిపుల్ ఐటీతో ఉన్నత విద్యాభ్యాసం



నాన్న రమణ లారీ డ్రైవర్, అమ్మ రామయ్యమ్మ గృహిణి. అన్నయ్య పృథ్వీ ఎంఎస్సీ చదువుతున్నాడు. నేను ట్రిపుల్ ఐటీ ద్వారా ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసి దేశసేవకు అంకితమవుతాను. నాకు 562 మార్కులు వచ్చాయి.

– అక్కరబోయిన రాజేష్, మజ్జివలస హైస్కూల్

సీఎం జగన్ పాలనలో ప్రతీ ఇంటికీ మేలు

మధురవాడ: ఎన్నికల ప్రచారంలో భాగంగా తనతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎక్కడకు వెళ్లినా విశేష ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్రం జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన నవరత్నాలు పథకాలతో ప్రతి ఒక్కరికీ మేలు జరిగిందన్నారు. ఫలితంగా ప్రజలు చాలా సంతృప్తిగా వున్నారన్నారు. ఆ అభిమానంతోనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి రుణం తీర్చుకుందామని ఎదురు చూస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా భీమిలిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుందని చెప్పారు. అంతా వైఎస్సార్‌సీపీ పక్షాన నిలిచి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తనతోపాటు ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, గాదే రోశిరెడ్డి, పోతిన మూర్తి బాబు, రాయిన సాయి, బుడుమూరి మీనా, పోతిన ఎల్లాజీ, మడక ఈశ్వరరావు పాల్గొన్నారు.



బక్కన్నపాలెంలో మహిళకు కరపత్రం అందజేసి ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

● జీవీఎంసీ 5వ వార్డు మారికవలసలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, పోతిన సురేష్, ముచ్చు రామారావు, జేఎస్ రెడ్డి ఆధ్వర్యంలో..., జీవీఎంసీ 7వ వార్డు బాపూజీ నగర్‌లో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో పసుపులేటి గోపి, బంగారు ప్రకాశ్, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, చేకూరి రజని, తమ్మినేని వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికవాడలో మెరిసిన విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస కార్మికవాడలోని పలు పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. చిట్టివలస శ్రీరామకృష్ణ విద్యాలయానికి చెందిన షేక్ రజియా 593, ఐ.త్రిసూన 588, ఎం.హర్షవర్ధన్ 585, ఎస్.ఆదిత్య 580, ఎ.గుణవంత్ 575, చందన 573, బి.సంపత్ 573 మార్కులు సాధించారు. వీరిని కరస్పాండెంట్ డొప్పా పార్వతి, ప్రిన్సిపాల్ మానాపురం సాయికుమార్, శ్రీనివాసరావు అభినందించారు. రామన్నపేట శ్రీసాయి రవీంద్ర స్కూల్‌కు చెందిన విద్యార్థులు 552, 548, 544 మార్కులు సాధించారు. వీరిని కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ అభినందించారు. చిట్టివలస వాణి విద్యానికేతన్‌లో ఎ.హాసిని 588, ఎం.దీక్షాతాంజలి 565, ఎ.గీతావర్ధిని 553, వి.రమ్య 550 మార్కులు సాధించారు. వీరిని కరస్పాండెంట్ ఎస్.వెంకటరావు అభినందించారు.